



శిక్షణకు హాజరైన కౌంటింగ్ సిబ్బంది

నేడే కౌంటింగ్

ఫలితాలు వెల్లడిలో జాప్యం వద్దు

ఏ రౌండ్‌కు ఆ రౌండ్ లెక్కింపు పూర్తికాగానే ప్రకటించండి

- ఆర్వోలకు సూచించిన జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):
ఏ రౌండ్‌కు ఆ రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించాలని, ఆ విషయంలో జాప్యం జరగకుండా చూసుకోవాలని జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచిం చారు. నిర్దేశిత వెబ్‌సైట్లలో వెంటవెంటనే అప్‌లోడ్ చేయ డంతోపాటు మీడియాకు ఫలితాలను ఫెసి లేషన్ సెంటర్ ద్వారా అందజేయాలన్నారు. సోమ వారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆర్వోలకు కలెక్టర్ ఈ మేరకు దిశా, నిర్దేశం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లకు కనీస వసతులు కల్పించాలని, గుర్తింపు పొందిన పార్టీల వారికి ముందు వరుసలో, రిజిస్టర్ అయ్యి గుర్తింపు పొందని పార్టీల ఏజెంట్లకు రెండో వరుసలో, స్వతంత్రుల ఏజెంట్లకు మూడో వరుసలో కుర్చీలు వేయాలని సూచించారు. తాగునీరు సదుపాయాన్ని కల్పించాలని, భోజనం సమకూర్చా లన్నారు. కేంద్రం లోకి వచ్చే ఏజెంట్లు ఫోన్లు తీసుకు రావడానికి వీల్లేదని, ఒక బాల్ పాయింట్ పెన్, పెన్సిల్, తెల్ల కాగితం మాత్రం తెచ్చుకోవచ్చునన్నారు. ఏజెంట్లు రౌండ్ల వారీ ఫలితాలను, ఇతర వివరాలను రాసుకోవడా నికి వీలుగా అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాలను ఆర్వోలు అందించవచ్చు నన్నారు. ఫలితాల వివరాలను ఈసీఐ ఎన్కోర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అదేవిధంగా మీడి యాకు నిర్దేశిత అధికారులు ద్వారా సమాచారం అందించా లన్నారు. ఈటీపీబీఎస్ ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 7.59 గంటల వరకు కూడా అనుమతించ వచ్చునని కలెక్టర్ స్పష్టంచేశారు. పోస్టల్ డిపార్టుమెం ట్‌కు వచ్చిన ఆయా బ్యాలెట్లు నిర్ణీత సమయానికి కౌం టింగ్ కేంద్రాలకు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉదయం ఆరు గంటలకు పోస్టల్ బ్యాలెట్ల స్ట్రాంగ్ రూమ్‌లను, 7.30 గంటలకు ఈవీఎంలు భద్రపర చిన గదులను తెరవా లని సూచించారు. ఈ ప్రక్రియ అంతా అభ్యర్థులు గానీ ఏజెంట్ల సమక్షంలో గానీ జరగాలన్నారు. పోస్టల్ బ్యాలె ట్ ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను, నిబంధనలను పాటించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్‌వర్మ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు

- పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 104 టేబుళ్లు
- అసెంబ్లీ నియోజక వర్గానికి 14 చొప్పున ఏర్పాటు
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 51 టేబుళ్లు
- అత్యధికంగా భీమిలిలో 26, విశాఖ పశ్చిమలో 16 రౌండ్లు
- కౌంటింగ్ కోసం 1,045 మంది సిబ్బంది
- అసెంబ్లీలకు 25,817, పార్లమెంటుకు 25,618 పోస్టల్ బ్యాలెట్లు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థా నాల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభం కానున్నది. వి శాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 19,27,303 మందికి గాను 13,70,484 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే పా ర్లమెంటు పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నగరంలో జరుగు తుండగా ఎస్.కోట సెగ్మెంట్ లెక్కింపు మాత్రం వి జయనగరం జిల్లాలో చేపడతారు. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో కలిపి 20,12,373 మ ంది ఓటర్లు ... మిగతా 6వ పేజీలో

విశాఖ జిల్లాలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలైన ఓట్లు, అందుకు ఏర్పాటుచేసిన టేబుళ్లు, రౌండ్లు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు	ఫలితం రాక.. అంచనా సమయం
భీమిలి	2,75,747	5,708	14	26	రాత్రి 9.30 గంటలు...
విశాఖ తూర్పు	2,00,563	3,905	14	21	రాత్రి ఏడుగంటలు
విశాఖ దక్షిణ	1,37,475	2,105	14	17	సాయంత్రం 5 గంటలు
విశాఖ ఉత్తర	1,84,703	3,606	14	20	సాయంత్రం 6.30 గంటలు
విశాఖ పశ్చిమ	1,48,942	2,716	14	16	సాయంత్రం 4.30 గంటలు
గాజువాక	2,32,938	4,126	14	22	రాత్రి 7.30 గంటలు
పెందుర్తి	2,28,938	4,651	14	21	రాత్రి ఏడు గంటలు
మొత్తం ఓటర్లు	14,09,316	25,817	84	143	

ఓట్ల లెక్కింపు ఇలా...

నాలుగు గంటలకల్లా సిబ్బంది, 6.30 గంటలకల్లా ఏజెంట్లు హాజరు కావాలి

- ఏజెంట్ల సమక్షంలో తెరుచుకోనున్న స్ట్రాంగ్ రూమ్‌ల తలుపులు
- ఎనిమిది గంటలకల్లా కౌంటింగ్ ప్రారంభం
- ఒకవైపు పోస్టల్ బ్యాలెట్లు, మరోవైపు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు
- అరగంటకొక రౌండ్ లెక్కింపు పూర్తి
- ఉదయం తొమ్మిది నుంచే ఫలితాలు వెల్లడి
- తుది ఫలితం రాత్రి తొమ్మిది గంటలు తరువాతే...

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):
ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం. అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రక్రియ జిల్లాకు సంబంధించి మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారం భం కానున్నది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. మరోవైపు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు చేపడతారు. అరగంటకో రౌండ్ లెక్కింపు పూర్తవుతుందని అంచనా. పోస్టల్ బ్యాలెట్ కాకుండా ఈవీఎం ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ వేగంగా జరిగే అవకాశం ఉన్నందున ఉదయం తొమ్మిది గంటలకల్లా మొదటి రౌండ్ ఫలితం వెల్లడవుతుందని అంటున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిది గంట లవుతుందని అధికారులు చెబుతున్నారు.



ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ పహారా

- ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు కోసం నియమితులైన ఉద్యోగులు మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంట లకే ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో కేటాయించిన బ్లాక్‌లకు చేరుకుని అధి కారులకు రిపోర్టు చేయాలి. తరువాత వారంతా ఆయా సెగ్మెంట్‌లకు చెందిన కౌంటింగ్ హాళ్లకు చేరుకుని, ఎవరికి ఏ టేబుల్ కేటాయించారో స్లిప్పుల ద్వా రా తెలుసుకుని అక్కడకు వెళ్లాలి. ఉదయం 5.30 గంటలకు నుంచి 6.30 గం టల మధ్య పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చే రుకోవాలి.
- ఏజెంట్ల సమక్షంలోనే ప్రతి నియోజకవర్గం స్ట్రాంగ్‌రూమ్‌ల తలుపులు ఓపెన్ చేసి ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బండిళ్లు భద్రత నడుమ సంబంధి త కౌంటింగ్ హాళ్లకు తరలిస్తారు. ఉదయం 7.50 గంటల వరకు వచ్చిన పో స్టల్ బ్యాలెట్లు (సర్వీస్ ఓట్లు) స్వీకరిస్తారు. సరిగ్గా ఎనిమిది గంటలకు పోస్ట ల్ బ్యాలెట్ బండిళ్లు తెరిచి వాటిలో కవర్లు ఓపెన్ చేసి ప్రతి ఓటు సక్రమం గా ఉందా? లేదా? అనేది సిబ్బంది పరిశీలిస్తారు. ఈలోగా టేబుళ్ల వద్దకు చే రుకునే ఈవీఎంల లెక్కింపు ప్రారంభమతుంది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓ ట్ల లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన 14 టేబుళ్లపై ... మిగతా 6వ పేజీలో

విజయంపై టీడీపీ ధీమా

- నమ్మకం పెంచిన ఎగ్జిట్ పోల్స్
- జిల్లాలో క్లీన్ స్వీప్ చేస్తామంటున్న కూటమి నేతలు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):
సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుపై తెలుగుదేశం పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. జనసేన, బీజేపీ కూడా తోడు కావడంతో విజయం నల్లేరుపై నడకేనని విశ్వాసంతో ఉన్నారు. రెండు రోజుల క్రితం విడుదలైన ఎగ్జిట్ పోల్స్‌లో మెజారిటీ సంస్థలు కూటమిదే అధికార మని తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ సీట్లు గెల్చుకుంటా మని కొందరు నేతలు చెబుతుండగా, మరికొందరు క్లీన్ స్వీప్ చేస్తామని అంటున్నారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గం విషయానికి వస్తే మెజారిటీ ఎంత అనే దానిపైనే అంచనాలు వేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉ ద్యోగులు, సర్వీస్ ఓటర్లు సుమారు 25 వేల మందికిపై గా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఒకటి, రెండు సెగ్మెంట్‌లలో పోస్టల్ బ్యాలెట్లే ఫలితాలను నిర్దేశించే అ వకాశం లేకపోలేదని అంటున్నారు. గత ఏడాది జరిగిన పట్టభద్ర ఎన్నికల్లో నగరంలో యువత, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ఉద్యోగులు, విద్యావంతులు టీడీ పీ అభ్యర్థికి ఓటు వేయడంతో రికార్డు స్థాయి మె జారిటీతో గెలుపొందారు. తామంతా ప్రభుత్వానికి వ్యతి రేకంగా ఉన్నామని ఏడాది క్రితమే ఆ వర్గాలు తేల్చిచె ప్పాయి. కాగా రాష్ట్రంలో కూటమి విజయం ఖాయమని సర్వేలు చెబుతున్న నేపథ్యంలో నగరంలో టీడీపీ శ్రేణు లు విజయోత్సవాలకు సిద్ధమవుతున్నారు. పార్టీ కార్యా లయంలో ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఫలితాల ట్రెండ్ బట్టి మధ్యాహ్నానికి కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి రావాలని ఇప్పటికే స మాచారం పంపారు. అయితే కొందరు నేతల్లో లోపల ధీమా ఉన్నా...వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తోందని ఐదారు సర్వే సంస్థలు చెప్పడంతో లోలోన ఆందోళనతో ఉన్నారు.

వైసీపీలో ఉత్కంఠ

- ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో పెరిగిన టెన్షన్
- విజయంపై ఆశలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు అత్యధికం కూటమికి అనుకూలంగా ఉండడంతో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతోపాటు ఆ పార్టీ నేతలు ఆందోళనగా ఉన్నారు. గత ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు తిరిగి అధికారం కట్టబెడతాయనే ధీమాతో నిన్నమొన్నటి వరకూ వైసీపీ నేతలు ఉన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కూడా మహిళలు తమకు మద్దతుగా నిలిచారని ఆ పార్టీ నేతలు విశ్లేషించారు. 2019 ఎన్నికల్లో సాధించిన స్థానాల కంటే తాజా ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. తమ సన్నిహితుల వద్ద కూడా గెలుపు తథ్య మని చెబుతుండేవారు. అయితే ... మిగతా 6వ పేజీలో

గెలుపెవరిదో?



శ్రీభరత్



బొత్స ఝాన్సీ



గంటా శ్రీనివాసరావు



ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వెలగపూడి రామకృష్ణబాబు



ఎంవీవీ సత్యనారాయణ



వంశీకృష్ణ శ్రీనివాస్



వాసుపల్లి గణేశ్‌కుమార్



పల్లా శ్రీనివాసరావు



అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఓటరు దేవుళ్ల తీర్పు వెలువడే రోజు వచ్చింది. ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. కౌంటింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైనా మధ్యాహ్నం 12 గంటల తరువాతే ఏ పార్టీకి విజయ ం దక్కుతుందనే విషయంలో స్పష్టత వస్తుంది. పోటీ చేసిన అభ్యర్థు ల్లో ఏమవుతుందో అనే ఆందోళన చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనంతగా భారీగా ఖర్చు చేశామని, ఓటర్లు ఎవరి పక్షాన నిలిచారో అర్థం కావడం లేదని అంటున్నారు. కొందరిలో మాత్రం స్పష్టమైన ధీమా గోచరిస్తోంది. విజయం ఖాయం అని విశ్వాసం గా చెప్పగలుగుతున్నారు. మరికొందరు అభ్యర్థులలో గెలుపుపై విశ్వా సం లేదు. భారీ తేడాతో ఓడిపోకుండా, గట్టి పోటీ ఇచ్చామని అంతా భావిస్తే చాలు అని సర్ది చెప్పుకొంటున్నారు. కూటమి అభ్యర్థులైతే విజయం తమదే అనే ధీమాతో విజయోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు పార్లమెంటు స్థానాలకు గట్టి పోటీ యే జరిగింది. విశాఖ పార్లమెంటుకు కూటమి తరపున టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పోటీ చేయగా, వైసీపీ నుంచి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కాంగ్రెస్ నుంచి సత్యారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా కేఏ పాల్ పోటీ చేశారు. పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధికులు శ్రీభరత్ విజయం ఖాయ మని ఘంటాపథంగా చెబుతున్నారు. కనీసం లక్ష ఓట్ల మెజారిటీ వ స్తుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీ వర్గాల్లో ఎంపీ స్థానంపై ఎటు

నేడే ఎన్నికల ఫలితాలు వెల్లడి

- మధ్యాహ్నం 12 గంటలకల్లా స్పష్టత
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్ల గెలుపుపై సంపూర్ణ విశ్వాసంతో కూటమి
- అరకులోయపైనా ఆశలు

వంటి ఆశలు కనిపించడం లేదు. ఇక్కడ నుంచి కేఏ పాల్ కూడా పోటీ చేశారు.

అనకాపల్లి పార్లమెంటు ఎన్నిక రసవత్తరంగా సాగింది. అక్కడ కూ టమి తరఫున మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేయగా, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోటీ చేశారు. ఇరువర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సర్వేలన్నీ సీఎం రమేశ్ గెలుస్తారని, మంత్రి బూడికి పరాజయం తప్పదని వెల్లడించాయి. ఓట ర్లు ఎవరిని కోరుకున్నారో మంగళవారం సాయంత్రం తేలిపోతుంది.

దేశంలో అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గాల్లో రెండో దైన అరకు నుంచి కూటమి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి సి టింగ్ ఎమ్మెల్యే కోడలు చెట్టి తనూజ, కాంగ్రెస్/వామపక్షాల అభ్యర్థిగా పి.అప్పలనర్స పోటీ చేశారు. ఇది ఐదు జిల్లాలలో కూడిన పార్లమెంటు నియోజకవర్గం కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో చెప్పలేని పరి స్థితి. వైసీపీ తమకే అవకాశం ఉందని ... మిగతా 6వ పేజీలో



విష్ణుకుమార్‌రాజు



కేకే రాజు



గణబాబు



ఆడారి ఆనంద్



పంచకర్ల రమేష్‌బాబు




అదీప్‌రాజ్

హై అలర్ట్

నగరంలో డ్రోన్లతో నిఘా

- ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 3,500 మందితో బందోబస్తు
- 133 సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక భద్రత
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు బాక్స్ టైప్ సెక్యూరిటీ
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే రౌడీషీట్
- గ్రూప్ అడ్మిన్లపై ఐటీ యాక్ట్ కింద కేసు
- ఫలితాలు అనంతరం ర్యాలీలు నిషేధం
- సీపీ రవిశంకర్ అయ్యన్నార్



ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి కూడలి వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):
ఓట్ల లెక్కింపు సందర్భంగా ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో నగ రంలో హై అలర్ట్ ప్రకటించారు. మంగళవారం నగరంపై డ్రోన్లతో నిఘా పెడుతున్నట్టు సీపీ రవిశంకర్ అయ్యన్నార్ వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రంతోపాటు నగరంలో భద్ర తాపరంగా తీసుకుంటున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఆయన వివరించారు. ఓట్ల లెక్కింపు జరిగే ఏయూ ఇంజనీ రింగ్ కాలేజీ ప్రాంగణంతోపాటు నగరవ్యాప్తంగా 3,500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి ఒక ఐపీఎస్ అధికారి, పలువురు నాన్‌కేడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీ స్థాయి అధికారులు, 300 మంది సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల స్థాయి సిబ్బందితోపాటు, ఐదు ప్లటూన్ల ఏపీఎస్పీ బలగాలు, రెండు ప్లటూన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలు నగరానికి చేరుకున్నాయన్నారు. కౌంటింగ్ సమయంలో, ఫలి తాలు వెల్లడైన తర్వాత అల్లర్లు జరిగేందుకు అవకాశం ఉన్న 133 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో మొబైల్ పెట్రోలింగ్ పార్టీతోపాటు పది మంది సిబ్బందితో పికెట్‌లను ఏర్పాటు ... మిగతా 6వ పేజీలో

కుప్పకూలిన భవనం

ముందుగా గుర్తించి బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు

- త్రుటిలో తప్పిన ప్రాణహాని
- శిథిల భవనాల కూల్చివేతలో జీవీఎంసీ నిర్లక్ష్యం



వన్‌టౌన్ గొల్లవీధిలో కుప్ప కూలిన పాత భవనం

పూర్ణామార్కెట్, జూన్ 3:
వన్‌టౌన్‌లో శిథిలావస్థకు చేరిన భవనం ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నానిపోయి సోమవారం ఉదయం కుప్పకూలింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరా లివి...గొల్లవీధిలో రామాలయం సమీపాన పాత భవ నంలో కాశీ అనే వ్యక్తి కుటుంబంతో నివాసముంటున్నా రు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ భవనం బాగా నానిపోయింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం భవనం కూలిపోయింది. అయితే, ప్రమా దాన్ని ముందుగా గుర్తించిన కాశీ కుటుంబం ఇంటి నుంచి ముందే బయటకు వచ్చేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ భవనం తమ పూర్వీకులు మట్టితో నిర్మించినట్టు కాశీ తెలిపారు. అయితే, ఆర్థిక స్థోమత లేక ఏళ్ల తరబడి అందులోనే నివాసముంటున్నట్టు ఆయన చెప్పారు. జనావాసాల మధ్య ఉన్న ఇల్లు కూలిపోవ డంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. వన్‌టౌ న్‌లో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేయ డంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటు న్నట్టు ఆరోపిస్తున్నారు.

నేతల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం చేపడుతుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, కార్యాలయాల వద్ద పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచే పోలీసులు పహారా కాస్తున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయం, ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నివాసాలతో పాటు బీజేపీ, వైసీపీ అభ్యర్థుల ఇళ్లు, వివిధ కార్యాలయాల వద్ద కూడా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

- విశాఖటపట్నం, ఆంధ్రజ్యోతి


కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ఇంటి వద్ద పోలీసులు...


మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు నివాసం వద్ద...



తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పహారా కాస్తున్న పోలీసులు


తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఇంటి వద్ద పోలీసులు


ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ఇంటి వద్ద...


కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు


భీమిలిలో వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి కార్యాలయం వద్ద..


ఉత్తర వైసీపీ అభ్యర్థి కేకే రాజు ఇంటి వద్ద పోలీసుల పహారా

గాండ్ల, తెలికుల సంక్షేమానికి కృషి


నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

మహారాణిపేట, జూన్ 3: గాండ్ల, తెలికుల సామాజిక వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని సంఘం నూతన అధ్యక్షుడు దాడి సత్యనారాయణ తెలిపారు. సోమవారం మహారాణిపేట దండుబజారు ప్రాంతంలో అఖిల గాండ్ల, తెలకుల సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ట్రస్టు బోర్డు చైర్మన్ పెబ్బిలి రవి కుమార్, దాడి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన స మావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. తెలికుల కులస్తులను ఒక తాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో కృషి చేస్తామన్నారు. ఇళ్లులేని వారికి ఇళ్ల మంజూరుకు, సామాజిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న రోజులలో పదో తరగతి, ఇంటర్‌లో అత్య ధిక మార్కులు సాధించిన చిన్నారులకు ప్రతిభా అవార్డులతోపాటు నగదు బహుమతులు అంది స్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో జిల్లాలో కల్యాణ మండ పాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో కన్వీనర్ ఏర్నేటి తాతారావు కార్యదర్శులు చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్ ఏర్నేటి సన్యాసిరావు , కనక సూర్య పద్మావతి, టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న బెనారస్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూన్ 3: చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధ వారం (5న) విశాఖ నుంచి బెనారస్ వెళ్లే 18311 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటల 45 నిమిషాలపాటు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖలో ఉదయం 4.20 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 7.05 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపుకు ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మంగళవారం జరగనుంది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బంది, ఇతర అధికారులు, పార్టీల ప్రతినిధులకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే, తక్షణం చికిత్సనందించేందుకు వీలుగా ఆరు మెడికల్ క్యాంపులను వైద్యశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటింగ్ కేంద్రం వద్ద ఒక్కో క్యాంపులో డాక్టర్, నర్సింగ్ సిబ్బంది, ఆశతోపాటు ప్రాథమిక వైద్య సేవల కోసం మెడికల్ కిట్, మందులు ఏర్పాటు చేశారు. అలాగే, రెండు 108 అంబులెన్స్, మరో రెండు ప్రైవేటు అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రాలు వద్ద సిద్ధంగా ఉంచుతున్నట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

» మలి విడత హ్యాండ్ హోల్డ్ శిక్షణలో కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనలు, ప్రత్యేక ఉత్తర్వులు ద్వారా ఇచ్చిన ఆదేశాలను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. పొరపాట్లకు తావులేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది పూర్తిగా సన్నద్ధం కావాలని సూచించారు. పార్లమెంట్ స్థానానికి పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కేటాయిం చిన అధికారులకు, సిబ్బందికి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఈఈఈ బ్లాక్‌లో ఏర్పాటుచేసిన లెక్కింపు కేంద్రంలో సోమవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.


శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

పరిశీలకులు, సీపీ రవిశంకర్‌తో కలిసి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సిబ్బంది పూర్తిగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ విధిగా ఐడీ కార్డులు ధరించాలని, మొబైల్ ఫోన్లను తీసుకురావద్దని సూచించారు. నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోవాలని,పోలీస్ సిబ్బందికి సహకరించాలని సీపీ రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్ ఓట్ల విభజన, లెక్కింపు, నివేదికల తయారీపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అవగాహన కల్పించారు. వాలిడ్, ఇన్వాలిడ్ ఓట్లను విభజించిన తరువాత అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలు వివరించారు. ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. శిక్షణలో ఏఆర్‌వోలు, అదనపు ఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ మైక్రో అబ్జర్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

మురళీనగర్, జూన్ 3 ; ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మురళీనగర్ మహిళా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బాలభాను స్కూలు వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో 51 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ప్లాస్టిక్ నిర్మూలన, పచ్చదనం పెంపు, కాలుష్య నివారణపై చిత్రాలను వేశారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు ఆకుకూరల విత్తనాలు, కూరగాయల విత్తనాలు అందించారు. జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవం రోజునవిజేతలకు బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మహిళా వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు ఎస్.లలితారెడ్డి, క్లబ్ కార్యదర్శి సి.హెచ్.లక్ష్మి, యూనివర్సల్ యూత్ వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ వంశీ, బాలభాను స్కూలు యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

జాతీయ చెస్ ర్యాపిడ్‌లో సాహితీవర్షిణి ప్రతిభ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 3: చెస్ ర్యాపిడ్‌లో జాతీయ మహిళల ర్యాంకింగ్‌లో విశాఖకు చెందిన ఫిడే మాస్టర్ మూగి సాహితీ వర్షిణి ఐదో స్థానానికి చేరింది. జాతీయస్థాయిలో మహిళల ర్యాపిడ్ ర్యాంకింగ్‌కు సంబంధించి ఫిడే రేటింగ్ విడుదల చేసిన జాబితాలో గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి (2456) ద్రోణావల్లి హారిక (2415), ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ (2401), గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు (2359) తొలి నాలుగు స్థానాలలో నిలవగా, 2329 రేటింగ్‌తో సాహితీ వర్షిణి ఐదో స్థానానికి చేరడం విశేషం. ఇటీవల బుడాపెస్ట్ స్ప్రింగ్ ఫెస్టివల్ చెస్ టోర్నీలో 2200 ప్లస్ రేటింగ్ మహిళల విభాగంలో పోటీపడి మూడో స్థానం సాధించడంతోపాటు 19 పాయింట్లను పెంచుకుంది. కాగా, క్లాసిక్‌లో 2269, ర్యాపిడ్‌లో 2329, బ్లిట్జ్ లో 2193 రేటింగ్‌లో ఉంది. సాహితీవర్షిణికి తన తండ్రి లోకేశ్ కోచ్‌గా వ్యవహరించనుండడం విశేషం.


ఐదో స్థానానికి చేరిన సాహితీవర్షిణి

ఓట్ల లెక్కింపు ఇలా...

... 5వ పేజీ తరువాయి

బూత్ నంబరు ఒకటి నుంచి 14 వరకు తొలి రౌండ్‌లో తీసుకువస్తారు. మొత్తం 14 టేబుళ్లపై ఈవీఎంలు లెక్కింపు పూర్తయితే ఒక రౌండ్‌గా పరిగణిస్తారు. అందువల్ల ప్రతి అరగంటకు ఒక రౌండ్ లెక్కింపు పూర్తవుతుంది.

- జిల్లాలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 25,817 పోస్టల్ బ్యాలెట్లు రాగా ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటుచేసిన అధికారులు 15 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. అలాగే పార్లమెంటుకు 25,681 పోస్టల్ బ్యాలెట్లు రాగా రెండు హాళ్లలో 18 టేబుళ్లు ఏర్పాటుచేసి మూడు రౌండ్లలో లెక్కింపు చేపడతారు. ఈవీఎంలతో పోల్చితే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఆలస్యం కానున్నది. ఈ నేపథ్యంలో పార్లమెంటు తుది ఫలితం వచ్చేసరికి రాత్రి పొద్దుపోతుందని అంచనా.

మధ్యవర్తిత్వంతోనే పెండింగ్ కేసుల పరిష్కారం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్


శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖపట్నం(లీగల్), జూన్ 3: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 70 నుంచి 90 శాతం మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు సోమవారం జిల్లా కోర్టుల ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 30మంది న్యాయమూర్తుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంసీపీసీ శిక్షకులు నిసాస క్సేనా, డాక్టర్ అదితి అగర్వాల్ సూచనల మేరకు మధ్యవర్తిత్వ మెలకువలు తెలుసుకుని, కేసులకు వాటిని అన్వయించి కక్షిదారులకు సత్వరన్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే సమయం, వ్యయం ఆదా అవుతుందన్నారు.

టీడీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు


బల్లగిరి వెంకన్న ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

అల్లిపురం, జూన్ 3: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ 33వ వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమాలదేవి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వెంకటేశ్వరమెట్ట బల్లగిరి వెంకన్న ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆవరణలో 108 కొబ్బరికాయలు కొట్టారు. దక్షిణ నియోజకవర్గంలో వంశీకృష్ణ గెలుపొందాలని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించామన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించారు. గందా సంధ్య, సింగంపల్లి మాధవి, పి. ఆదినారాయణ, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై 'డయల్ యువర్ సీపీ'

మహారాణిపేట, జూన్ 3: పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో కమిషనర్ ఏ రవిశంకర్ సోమవారం దిశ దివ్యాంగ సురక్ష డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది దివ్యాంగ కాలర్స్ నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కారానికి అధికారులకు దేశించారు.

బస్సుపాస్ కౌంటర్లకు రెండు రోజులు సెలవు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 3: ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని బస్‌పాస్ కౌంటర్లకు గురు,శుక్రవారాలు సెలవు. ఈ మేరకు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్సు పాస్‌లకు సంబంధించిన అప్లికేషన్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా బస్సు పాస్‌ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా రెండు రోజులు పనిచేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సు, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, మధురవాడ, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ , వాల్తేరు, పెందుర్తిలలోని కౌంటర్లనుంచి బస్సు పాస్‌లు జారీ కావని ఆర్ఎం పేర్కొన్నారు. బస్సుల పాస్‌ల వినియోగదారులు దీన్ని గమనించాలని సూచించారు. శనివారం నుంచి అన్ని కౌంటర్లనుంచి అన్ని రకాల బస్సు పాస్‌లు జారీచేస్తామని పేర్కొన్నారు.

రిసార్ట్‌లకు ఫుల్ డిమాండ్

స్నేహితులతో కలిసి ఎన్నిక ఫలితాలను వీక్షించేందుకు పలువురు ఆసక్తి

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు మంగళవారం జరగబోతోంది. ఈ సందర్భంగా నగరంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, రిసార్టుల్లో గదులకు డిమాండ్ పెరిగింది. గతనెల 13న సార్వత్రిక ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఫలితాలపై తీవ్ర ఆసక్తి నెలకొంది. విజయంపై ఎవరికివారే ధీమా వ్యక్తంచేస్తున్నా వైసీపీ నేతలు ఓటమి తప్పదనే అభిప్రాయంతో ఉన్నారు. అయితే విజయంపై వారిలో ఎక్కడో ఆశలున్నాయి. కాగా కూటమి అభ్యర్థులకు విజయంపై ధీమా ఉన్నప్పటికీ సంక్షేమపథకాలు వైసీపీకి దన్నుగా నిలుస్తాయేమోననే భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లు కూడా భారీగానే జరిగాయి. సర్వే సంస్థల్లో అత్యధికం కూటమి విజయం సాధిస్తుందని తేల్చడంతో 2:1 నిష్పత్తిలో బెట్టింగ్‌లు జరిగాయి. కౌంటింగ్ నేపథ్యంలో బెట్టింగ్ కాసినవారితోపాటు ప్రధానపార్టీల నాయకులు, కార్యకర్తలు స్నేహితులతో కలిసి ఎన్నికల సరళిని టీవీల్లో వీక్షించేందుకు ఆసక్తిచూపుతున్నారు. వారంతా నగరశివార్లలోని గెస్ట్‌హౌస్‌లు, బీచ్‌రోడ్డులోని హోటళ్లు, రిసార్టుల్లో గదులను బుక్ చేసుకున్నారు. ఇప్పటికే రిసార్టులు హౌస్‌ఫుల్ అయిపోగా, బీచ్‌రోడ్డులోని స్టార్‌హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల్లో కూడా రూమ్‌లన్నీ దాదాపు బుక్ అయిపోయినట్టు హోటళ్ల నిర్వాహకులు తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న గంటా

జగదాంబ కూడలి, జూన్ 3: విశాఖ పార్లమెంట్ సీటుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయనున్నారని మాజీ మంత్రి, టీడీపీ భీమిలి నియోజవర్గఅభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ పాలనకు మంగళవారం ఫలితాలతో తెరపడనుందన్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ కూటమిదే విజయమంటూ తేల్చాయన్నారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎంత త్వరగా ఈ ప్రభుత్వాన్ని తరిమేయాలన్న ఆలోచనతో ఓట్లు వర్షం కురిపించారనిఅభిప్రాయం వ్యక్తంచేశారు. అత్యధికశాతం మంది ఓటు హక్కు వినియోగించడం కూటమి విజయానికి సంకేతమని అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నా రు. ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యంఅన్నారు. భీమిలిలో తన గెలుపు ఖాయమని అన్నారు.

నేడే కౌంటింగ్

... 5వ పేజీ తరువాయి

ఉండగా 14,09,316 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 104, జిల్లాలోని ఏడు (భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ దక్షిణ, విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ, గాజువాక, పెందుర్తి) అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 వంతున 98 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 51 టేబుళ్లు ఏర్పాటుచేశారు. ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ కోసం అత్యధికంగా భీమిలి నియోజకవర్గంలో 26 రౌండ్లు, తక్కువగా విశాఖ పశ్చిమలో 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపడతారు. సోమవారం సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు విశాఖ పార్లమెంటు నియోజకవర్గానికి 25,681, జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు 25,817 వచ్చాయి. లెక్కింపు ప్రక్రియ కోసం 1,045 మంది ఉద్యోగులను నియమించారు. వీరందరికీ సోమవారం తుది దశ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్డులు అందజేశారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు...

పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా గదులు కేటాయించారు. భీమిలి నియోజకవర్గ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని న్యూక్లాస్‌రూమ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నంబరు-5లో జరుగుతుంది. పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు రూమ్ నంబరు-7, విశాఖ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లు రూమ్ నంబరు-8, ఎంపీ ఓట్లు మొదటి అంతస్థు రూమ్ నంబరు-10లో చేపడతారు. అలాగే విశాఖ దక్షిణ నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంటు ఓట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం మొదటి అంతస్థులో చేపడతారు. న్యూ క్లాస్‌రూమ్ మొదటి అంతస్థు రూమ్-1లో విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్, రూమ్ నంబరు-5లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కిస్తారు. ఇనుస్ట్రుమెంటేషన్ విభాగంలోని సెమినార్ హాలులో విశాఖ పశ్చిమ అసెంబ్లీ, క్లాస్‌రూమ్-3లో పార్లమెంటు ఓట్లు, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం కింద అంతస్థులోని డ్రాయింగ్‌రూమ్‌లో గాజువాక అసెంబ్లీ, మొదటి అంతస్థులోని సెమినార్ హాలులో పార్లమెంటు, ఇంజనీరింగ్ కళాశాల మెయిన్‌బ్లాక్ రూమ్ నంబరు 205లో పెందుర్తి అసెంబ్లీ, మొదటి అంతస్థులోని రూమ్ నంబరు 202లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కింపు చేపడతారు. కాగా పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లు ఈఈఈ విభాగం సెమినార్ హాలులో నిర్వహించనున్నారు.

గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

భావిస్తోంది. ఇప్పటికే ఒకసారి ఎంపీగా గెలిచి ఉండడం, అనేక అభివృద్ధి పనులు చేసిన పేరు ఉండడంతో రెండోసారి ఎంపీగా గెలుస్తానని కొత్తపల్లి గీత ధీమా వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ జిల్లాలో గాజువాక, భీమిలి, తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజక వర్గాల్లో బలమైన అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేయగా, వైసీపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పోటీగా నిలిపింది. ఈ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి అమర్‌నాథ్ గెలుపుపై పార్టీ వర్గాలు కూడా ఆశలు పెట్టుకున్నట్టు లేవు. ఇక్కడి నుంచి కేఏ పాల్ కూడా ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మిత్రులు పోటీ పడ్డారు. ఇద్దరూ మాజీ మంత్రులే. టీడీపీ నుంచి గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పోటీ చేశారు. ముత్తంశెట్టి భీమిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఇదేమూడోసారి. గంటా శ్రీనివాసరావు తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక నియోజకవర్గం నుంచి రెండో దఫా పోటీ చేయడం ఇదే తొలిసారి. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది వేచి చూడాలి.

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరపున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీ చేశారు. వాసుపల్లి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇది మూడోసారి. ఇరు వర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. వంశీకృష్ణ శ్రీనివాస్ మంచి మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ శిబిరంలోను దక్షిణం తమదే అనే మాట వినిపిస్తోంది.

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పాత కాపులే మళ్లీ బరిలో దిగారు. ఒకే సామాజిక వర్గం నుంచి ప్రధాన పార్టీలు అభ్యర్థులు నిలవడం విశేషం. కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, వైసీపీ తరపున కేకే రాజు పోటీ చేశారు. ఈసారి టీడీపీ, జనసేనలు కూడా అండగా నిలవడంతో విజయం ఖాయమని విష్ణుకుమార్‌రాజు విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు తన గెలుపు ఖాయమని కేకే రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పశ్చిమంలో టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనందకుమార్ పోటీ చేశారు. ఇరు వర్గాలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి.

హై అలర్ట్

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. సిబ్బందికి బాడీ వార్న్ కెమెరాలను అందజేసి, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. అల్లర్లకు పాల్పడేందుకు అవకాశం ఉందని గుర్తించిన 230 మందితోపాటు 650 మంది యాక్టివ్ రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటుచేసి నగరంలో ఏ ప్రాంతంలో ఏం జరుగుతుందనేది ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా అల్లర్లు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గుంపులుగా తిరుగుతున్నాసరే డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే మూడు నిమిషాల వ్యవధిలో సిబ్బంది అక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి నియోజక వర్గానికి ఒక డ్రోన్‌ను కేటాయించామని, వాటిని సిబ్బంది ఎగరవేస్తూ వీధులు, కూడళ్లలో జనసంచారం ఎలా ఉందనే దానిపై నిఘా పెడతారన్నారు. నగరంలో 144 సెక్షన్‌తోపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ర్యాలీలు, విజయోత్సవ సంబరాలు, సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఓట్ల లెక్కింపునకు వెళ్లే సమయంలోనూ, పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికివెళ్లే సమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, ముప్పు ఉందని గుర్తించిన అభ్యర్థులకు బాక్స్ తరహా సెక్యూరిటీ కల్పిస్తామని సీపీ చెప్పారు. అలాగే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోటీలో నిలిచిన 44 మంది అభ్యర్థుల ఇళ్ల వద్ద కూడా ముందుజాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై కేసులు పెట్టి రౌడీషీట్ తెరుస్తామని సీపీ హెచ్చరించారు. ఆయా గ్రూపుల అడ్మిన్లను కూడా బాధ్యులను చేసి ఐటీ యాక్ట్ 66ఏ కింద కేసులు నమోదుచేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనల కేసుల్లో చిక్కుకుంటే వారికి భవిష్యత్తులో పాస్‌పోర్ట్ పొందే అవకాశం కోల్పోవాల్సి ఉంటుందన్నారు.

వైసీపీలో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఈనెల ఒకటో తేదీ సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ వైసీపీ నేతలకు చెమటలు పట్టించాయి. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థల్లో అత్యధికం కూటమిదే విజయమని స్పష్టం చేశాయి. కూటమికి 120 నుంచి 161 స్థానాలు రాబోతున్నాయని పేర్కొనడంతో వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేశామని, ఒకవేళ ఓటమిపాలైతే ఆర్థిక ఇబ్బందులతోపాటు కొత్త ప్రభుత్వం నుంచి సమస్యలు కూడా చుట్టుముడతాయని కంగారుపడుతున్నారు. కానీ కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వైసీపీకి అనుకూలంగా ఉండడంతో విజయంపై ఆశతో ఉన్నారు. భారీ మెజారిటీ అవసరం లేదని, ఏదోవిధంగా బయటపడితే చాలని అనుకుంటున్నారు.



సుసర్ల కాలనీ డబుల్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

వర్షపు నీటితో ఇబ్బందులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 3: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని సుసర్లకాలనీ నుంచి ఎన్ఎస్‌టీఎల్‌కు వెళ్లే డబుల్ రోడ్డులో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా ఇక్కడ ఉన్న యరాన్ ఆన్‌లైన్ ఎగ్జామ్ సెంటర్ ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతుండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న గోతులు అధికంగా ఉండడంతో అందులో నీరు చేరడంతో ఏది గొయ్యో తెలియక వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డ్యూటీ డ్రెస్సులు పంపిణీ

మల్కాపురం, జూన్ 3: హెచ్‌పీసీఎల్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్మికులకు సోమవారం డ్యూటీ డ్రెస్సుల (పని చేసే సమయంలో కార్మికులు వేసుకునే వస్త్రాలు)ను సంస్థ అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ రిఫైనరీ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) శ్రీకాంత్ మాట్లాడుతూ సొసైటీ కార్మికులు హెచ్‌పీసీఎల్ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటున్నారన్నారు. అందువల్ల సంస్థ ఎప్పుడూ వారికి సహకరిస్తుందన్నారు. కార్మికులందరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు నూనెల రమణ, పైడిరాజు, బి.చిన్నారావు, కోశాధికారి వైఏ భాస్కరరావు, డైరెక్టర్లు సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, వై.అప్పలరాజు,తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దోమల నివారణ చర్యలు



నాగేంద్రకాలనీలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం, జూన్ 3: దోమల వ్యాప్తిని అరికట్టడానికి మలేరియా విభాగంగా ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలను ముమ్మరంగా చేపడుతున్నారు. 98వ వార్డు పరిధి కొత్తపాలెం గ్రామంలోని నాగేంద్రకాలనీ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల దోమల వ్యాప్తిని అరికట్టడానికి మలేరియా విభాగం ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

ముగిసిన విజయ రాఘవస్వామి ఆలయ వార్షికోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 3: తుంగ్లాం కాలనీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న విజయ రాఘవస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవీశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో సీతారాముల వారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తుంగ్లాం, చుక్కవానిపాలెం, బీహెచ్‌పీవీ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు నావన సింహచలం, జి.అప్పారావు, కె.అప్పలరెడ్డి, వి.రామిరెడ్డి,పి అర్జున్, ఎస్.అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 33, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 18, క్యారెట్ 38, దొండకాయలు 20, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 156, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	123
ఫారం ధర	--	143
విత్ స్కిన్	--	256
స్కిన్‌లెస్	--	266

పెందుర్తిలో నువ్వా.. నేనా!

గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న జనసేన, వైసీపీ శ్రేణులు



పంచకర్ల రమేశ్‌బాబు | అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనుండడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎవరిని విజయం వరిస్తుందో తేలిపోనున్నది. పెందుర్తి శాసనసభ స్థానానికి మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా, ప్రధాన పోటీ మాత్రం కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మధ్యే నెలకొంది. వీరిరువురు గతంలో పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారే కావడంతో.. ఈ దఫా ఎవరు గెలుస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2009లో పంచకర్ల రమేశ్‌బాబు ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యే ఎన్నికవ్వగా, 2019లో వైసీపీ నుంచి అదీప్‌రాజ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు జనసేన అభ్యర్థి పంచకర్ల గెలుపునకు దోహదపడతాయని కూటమి శ్రేణులు చెబుతుంటే.. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మహిళల ఓట్లు తమ పార్టీకే పడినందున వైసీపీ అభ్యర్థి అదీప్‌రాజ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ, పట్టణ ఓటర్లు తమ పక్షాన్నే నిలిచారని ఇరు పార్టీల అభ్యర్థులు చెబుతుండడం గమనార్హం. ఈ క్రమంలో 'పెందుర్తి'లో 74.38 శాతం పోలింగ్ నమోదవ్వడం తమకే లాభించిందని ఎవరికి వారు విజయంపై అంచానాలు వేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో 299 పోలింగ్ బూత్‌లకు గాను 3,07545 ఓటర్లు ఉండగా 2,28,740 ఓట్లు పోలయ్యాయి. పురుష ఓటర్లు మొత్తం 1,52,592కు గాను 1,11970 ఓట్లు పోలయ్యాయి. మహిళా ఓటర్లు 1,54,948 మందికి గాను 1,16,766 ఓట్లు పోలయ్యాయి. ఇతరులు ఐదుగురు ఉండగా, నలుగురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా పురుష ఓటర్ల కన్నా మహిళల ఓట్లు 4,790 అధికంగా పోలయ్యాయి. సబ్బవరం మండలలో అత్యధికంగా 84.6 శాతం పోలింగ్ జరగ్గా, పెందుర్తిలో 69.08 శాతం, పరవాడలో 77.62 శాతం పోలింగ్ నమోదైంది. పెందుర్తిలో 1,18,747 మంది, సబ్బవరంలో 50,997, పరవాడలో 50,034, పెదగంట్యాడలో 9,537 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా నియోజవర్గంలో కాపు కులస్థులు అధికంగా ఉన్నందున అదే సామాజిక వర్గానికి చెందిన పంచకర్లకు కలిసి వచ్చే అవకాశం ఉందని కూటమి శ్రేణులు పేర్కొంటున్నారు. అలాగే మహిళలు అధికంగా వైసీపీకే ఓట్లు వేయడంతో పాటు అదీప్‌రాజ్ స్థానికుడు కావడం ఆయనకు లాభం చేకూర్చుతుందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఏదిఏమైనా మరికొన్ని గంటల్లో పెందుర్తి విజేత ఎవరో తేలిపోనున్నది.

స్టీల్‌ప్లాంటులో నత్రజని పీడనాన్ని తగ్గించే స్టేషన్లు ప్రారంభం



నత్రజని పీడనాన్ని తగ్గించే స్టేషన్‌లను ప్రారంభిస్తున్న ఉక్కు డైరెక్టర్ ఏకే బాగ్చి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3: ఉక్కు కర్మాగారంలో నత్రజని పీడనాన్ని తగ్గించే స్టేషన్లను సోమవారం ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) ఏకే బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాస్ట్ ఫర్నేస్‌ల ఉత్పాదకను పెంచడానికి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఆధునిక టెక్నాలజీని వినియోగించి నాణ్యమైన ఉత్పత్తిని తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ నత్రజని స్టేషన్ల వల్ల బ్లాస్ట్ ఫర్నేస్‌లో ప్రస్తుత ఉత్పత్తికి కన్నా 100 నుంచి 180 కిలో హాట్ మెటల్ పెంచడానికి వీలు కలుగుతుందని బాగ్చి పేర్కొన్నారు.

అదేవిధంగా వ్యయం కూడా తగ్గుతుందన్నారు. స్టీల్‌ప్లాంటులో ఇదొక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం ఉన్నతాధికారులు, పలువురు ఉద్యోగులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

లేళ్ల కోటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వినతి

ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారంటూ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు వివరించిన 86వ వార్డు నాయకులు



శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న 'నల్లూరు' తదితరులు

విశాఖపట్నం, జూన్ 3: గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం పని చేయకుండా వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడిన 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, టీడీపీ వార్డు మాజీ అధ్యక్షుడు కర్రి ఈశ్వరరావు, మాజీ కార్యదర్శి బొడ్డ రమణలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం 86వ వార్డు పార్టీ నాయకులు విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేశారు. 2019 ఎన్నికల్లో కూడా లేళ్ల కోటేశ్వరరావు, తదితరులు టీడీపీకి పని చేయకుండా వైసీపీకి పనిచేయడంతో అప్పట్లో టీడీపీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. గతనెలలో వీరిపై సస్పెన్షన్‌ను ఎత్తివేసినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. లేళ్ల కోటేశ్వరరావు వైసీపీకి కొమ్ము కాస్తూ తమ కుమారుడికి కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని తెచ్చుకున్నారని, తెచ్చుకొన్న విషయాలను, గతనెల 13న జరిగిన ఎన్నికల్లో టీడీపీకి పనిచేయకుండా, వైసీపీ కోసం పని చేశారని పేర్కొన్నారు. అందువల్ల లేళ్ల, తదితరులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. శ్రీభరత్‌ను కలిసిన వారిలో టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, అధ్యక్షుడు కనకరాజు, కార్యదర్శి వేగుంట శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య?

మృతుని తల్లి ఫిర్యాదు, భార్య ఆరోపణల మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు



ఆత్మహత్యకు పాల్పడిన రామారావు (ఫైల్ ఫొటో)

పెందుర్తి, జూన్ 3: గత ఏడాది నగరంలో కలకలం రేపిన వన్‌టౌన్ కానిస్టేబుల్ బర్రి రమేశ్ హత్య కేసులో ప్రధాన నిందితురాలైన భార్య శివజ్యోతి అలియాస్ శివాని ప్రియుడు, నిందితుడు సియ్యాద్రి వెంకట రామారావు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న రామారావుది హత్య అని, శివానీయే తన భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నిస్తుందని మృతుడి భార్య లావణ్య అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని తల్లి కూడా తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయనడంతో పెందుర్తి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేశ్‌తో ఆయన భార్య శివాని అతిగా మద్యం తాగించి తన ప్రియుడైన టాక్సీ డ్రైవర్ రామారావు సహకారంతో ముఖంపై దిండు అదిమి ఊపిరాడనివ్వకుండా చేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జైలుకు వెళ్లిన వీరిద్దరూ కొన్నాళ్ల కిందట బెయిల్‌పై బయటకు వచ్చారు. కొంతకాలం కంచరపాలెంలో ఉన్నారు. మూడు నెలల నుంచి పెందుర్తి మండలంలోని రాజయ్యపేటలో ఓ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శివాని, రామారావుల మధ్య కానిస్టేబుల్ రమేశ్ హత్య విషయంలో పెద్ద వివాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. అనంతరం గది తలుపులు వేసుకున్న రామారావు చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. అయితే ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో శివాని అనుమానంతో కిటికీలోంచి చూడగా రామారావు ఆత్మహత్య చేసుకున్నట్టు కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా తనకుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని రామారావు తల్లి అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే తన భర్తతో సహ జీవనం చేస్తున్న శివానీయే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తుందని రామారావు భార్య లావణ్య పోలీసులకు తెలిపింది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక వాస్తవాలు తెలుస్తాయని, అందువల్ల అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.



వుడానగర్ ఫేజ్-1లో పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు



వుడానగర్ ఫేజ్-7లో పైపులైన్ నుంచి లీక్ అవుతున్న నీరు



రాజీవ్ నగర్‌లో రోడ్డుపై పారుతున్న మంచినీరు

పైపు లైన్లకు లీకేజీలు..

రోడ్లపై పారుతూ కాలువల్లో కలుస్తున్న తాగునీరు

నెలల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన



వుడా నగర్‌లో కొళాయిల ద్వారా వస్తున్న బురద నీరు

కూర్మన్నపాలెం, జూన్ 3: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యతో ఒకపక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే.. మరోపక్క ఎక్కడిక్కడ పైపులైన్లు లీకేజీలతో మంచినీరు వృథాగా కాలువల్లో కలుస్తుండడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 86వ వార్డు పరిధి వుడానగర్ 1,2,7, రాజీవ్‌నగర్ రహదారుల్లో ఆరుచోట్ల గత కొన్ని నెలలుగా పైపు లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఫలితంగా వుడా నగర్‌లో బురద నీరు సరఫరా అవుతుందని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. పైపు లైన్ల లీకేజీ వల్ల నీరంతా వరదలా రోడ్డుపై పారుతూ మురుగు కలుస్తుండడం ఎంతో బాధాకరం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. కాగా రహదారిపై నీరు పారుతుండడం వల్ల వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. పైపులైన్ల లీకేజీ వల్ల నీరు కలుషితమవుతుందని, ఆ నీటిని తాగి జ్వరాలు, డయేరియా బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు చర్యలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ల లేకేజీల వల్ల అంతంత మాత్రంగానే తాగునీరు సరఫరా అవుతున్నందున వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీ నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎస్సీ,ఎస్టీ సంఘం ప్రతినిధులు

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీ నవీన్‌కుమార్‌కు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి హెచ్‌వోడీగా పదోన్నతి పొందిన ఏపీ నవీన్‌కుమార్‌ను ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు మరింత మెరుగుపరిచి, ఉక్కు ఉద్యోగులకు సేవలందించాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. అందరి సహకారంతో రోగులకు నాణ్యమైన సేవలందిస్తానని హెచ్‌వోడి పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, మోహన్‌బాబు, ఎల్‌వీ రమణ, నాయక్, ఫణీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, జూన్ 3: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ బాధ్యతలు చేపట్టాలని కోరుతూ పెదగంట్యాడకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బీసీ రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంగళవారం వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా ఎం.శ్రీభరత్, గాజువాక శాసనసభ్యునిగా పల్లా శ్రీనివాసరావులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని ప్రార్థిస్తూ అభయాంజనేయస్వామికి పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, పెదగంట్యాడ టీడీపీ కార్యాలయ కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, నాయకులు బొంగు రాజు, పులి శ్రీరామరెడ్డి, కె సన్యాసమ్మ, మొల్లి అప్పారావు, జనసేన నాయకుడు జ్యోతిరెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్లాంట్ నాయకులు

ఉక్కు పరిరక్షణకు రక్తదానం చేద్దాం

సీఐటీయూ ప్లాంట్ నాయకుల విజ్ఞప్తి ▸▸ 14న సీడబ్ల్యూసీ-1లో శిబిరం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3: ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం రక్తదానం చేద్దామని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న సీడబ్ల్యూసీ-1లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని గతంలో రక్తదానం చేశామని, ఆ తర్వాత ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ రక్తదానం చేయడం జరుగుతుందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారరని, అయినా గుర్తింపు సంఘం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులకు సకాలంలో జీతాలివ్వడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, గంగాధర్, రాజు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం

గాజువాక, జూన్ 3: ప్రధాన రాజకీయ పార్టీలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈసారి కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మంగా తీసుకున్న సంగతి తెలిసిందే. గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఒక్కో అభ్యర్థి నుంచి 21 మంది ఏజెంట్లు కౌంటింగ్‌కు హాజరు కానున్నారు. గాజువాకకు సంబంధించి 14 ఈవీఎం టేబుళ్లు, ఆరు పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు, ఒక ఆర్‌వో టేబుల్ ఉండనున్నాయి. టేబుల్‌కు ఒక్క ఏజెంట్ చొప్పున 21 మంది కౌంటింగ్‌కు హాజరు కానున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నందున ఆయా పార్టీల ఏజెంట్లను ఆరున్నరకే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఓట్ల కౌంటింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కాగా కౌంటింగ్‌కు హాజరవుతున్న ఏజెంట్‌లకు ఆయా పార్టీ కార్యాలయాల్లోనే ఇప్పటికే తగిన సూచనలు ఇవ్వడం జరిగింది.

ఫలితాలను వీక్షించేందుకు ఏర్పాట్లు

ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు ఎవరికి వారు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు ఫలితాలను టీవీలు వీక్షిస్తూ తెలుసుకునేందుకు ఆయా పార్టీల నాయకులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది. హోటళ్లలో కూడా అనుమతి లేకపోవటంతో కొంతమంది ఒకచోట కూర్చుని ఫలితాలను తెలుసుకునేందుకు చర్యలు చేపట్టారు.

మల్కాపురంలో 144 సెక్షన్ అమలు

మల్కాపురం, జూన్ 3: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్‌ను విధించారు. మంగళవారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు. నిబంధనల ప్రకారం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేపట్టరాదన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచారు. వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పలు సూచనలు చేశారు. అలాగే రాజకీయ పార్టీల నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడినా, ఎవరినైనా అలా చేయాలని ఉసిగొలిపినా తగిన చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా కూడళ్లలో ఎవరూ గుంపుగా ఉండరాదని సూచించారు.

ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి: సీఐ శ్రీనివాసరావు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 3: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు కోరారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ పార్టీల శ్రేణులు ర్యాలీలు, సభలు నిర్వహించడం నిషేధమన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



డీపీఈ శివశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

అగనంపూడి, జూన్ 3: అగనంపూడి, పరిసర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కోరుతూ ఈపీడీసీఎల్ సెక్షన్ డీఈపీ దాసరి శివశంకర్ ప్రసాద్‌ను స్థానిక నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో 20 గ్రామాలు ఉన్నాయని, సుమారు 30 వేల జనాభా నివసిస్తున్నారన్నారు. అయితే అందుకు తగ్గట్టుగా ప్రత్యేక సబ్ స్టేషన్ లేకపోవడంతో నిత్యం లో-వోల్టేజీ సమస్య వేధిస్తుందని, దీనివల్ల తరచూ టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఎలక్ట్రికల్ వస్తువులు మరమ్మతులకు గురువుతున్నాయని వివరించారు. అలాగే ఇటీవల వర్షాలు కురవడంతో పాటు ఈదులు గాలలు వీయడంతో రెండు రోజులు పాటు పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారని, ఈ కారణంగా ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారన్నారు. సిబ్బందిని పెంచి పనులు చేపడితే సకాలంలో విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఈపీని కలిసి వారిలో నాయకులు బి.సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, కె.అప్పారావు, రాము, చంద్రమౌళి, నారాయణరావు, సోమేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

కుంటిసాకులు చెబుతున్న ఉక్కు యాజమాన్యం

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 3: స్టీల్‌ప్లాంటులో ఉక్కు కార్మికులకు సరిపడా నిధులున్నా పక్షపాత వైఖరితో, కార్మికులను ఇబ్బందులకు గురి చేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో యాజమాన్యం కుంటిసాకులు చెబుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,207వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల మార్కెట్ నుంచి సుమారు రూ.1,800 కోట్లు అడ్వాన్సుల రూపంలో వచ్చాయని, సుమారు 1,100 కోట్లు రూపాయిలు వ్యాపారం జరిగినా, ఉక్కు ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు ఉక్కు యాజమాన్యం యోచించకపోవడం అన్యాయమన్నారు. ఇతర ఉక్కు కర్మాగారాల్లో నూతన వేతన ఒప్పందాలు జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇక్కడి కార్మికులకు అతీగతీ లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కార్మికులు పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేతల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం చేపడుతుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు, కార్యాలయాల వద్ద పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచే పోలీసులు పహారా కాస్తున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయం, ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నివాసాలతో పాటు బీజేపీ, వైసీపీ అభ్యర్థుల ఇళ్లు, వివిధ కార్యాలయాల వద్ద కూడా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

- విశాఖటపట్నం, ఆంధ్రజ్యోతి


కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ ఇంటి వద్ద పోలీసులు...


మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు నివాసం వద్ద...



తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పహారా కాస్తున్న పోలీసులు


తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఇంటి వద్ద పోలీసులు


ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ఇంటి వద్ద...


కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు


భీమిలిలో వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి కార్యాలయం వద్ద..


ఉత్తర వైసీపీ అభ్యర్థి కేకే రాజు ఇంటి వద్ద పోలీసుల పహారా

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న గంటా

జగదాంబ కూడలి, జూన్ 3: విశాఖ పార్లమెంట్ సీటుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయనున్నారని మాజీ మంత్రి, టీడీపీ భీమిలి నియోజవర్గఅభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ పాలనకు మంగళవారం ఫలితాలతో తెరపడనుందన్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ కూటమిదే విజయమంటూ తేల్చాయన్నారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎంత త్వరగా ఈ ప్రభుత్వాన్ని తరిమేయాలన్న ఆలోచనతో ఓట్లు వర్షం కురిపించారనిఅభిప్రాయం వ్యక్తంచేశారు. అత్యధికశాతం మంది ఓటు హక్కు వినియోగించడం కూటమి విజయానికి సంకేతమని అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నా రు. ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యంఅన్నారు. భీమిలిలో తన గెలుపు ఖాయమని అన్నారు.

నేడే కౌంటింగ్

... 5వ పేజీ తరువాయి

ఉండగా 14,09,316 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 104, జిల్లాలోని ఏడు (భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ దక్షిణ, విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ, గాజువాక, పెందుర్తి) అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 వంతున 98 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 51 టేబుళ్లు ఏర్పాటుచేశారు. ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ కోసం అత్యధికంగా భీమిలి నియోజకవర్గంలో 26 రౌండ్లు, తక్కువగా విశాఖ పశ్చిమలో 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపడతారు. సోమవారం సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు విశాఖ పార్లమెంటు నియోజకవర్గానికి 25,681, జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు 25,817 వచ్చాయి. లెక్కింపు ప్రక్రియ కోసం 1,045 మంది ఉద్యోగులను నియమించారు. వీరందరికీ సోమవారం తుది దశ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్డులు అందజేశారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు...

పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా గదులు కేటాయించారు. భీమిలి నియోజకవర్గ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని న్యూక్లాస్‌రూమ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నంబరు-5లో జరుగుతుంది. పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు రూమ్ నంబరు-7, విశాఖ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లు రూమ్ నంబరు-8, ఎంపీ ఓట్లు మొదటి అంతస్తు రూమ్ నంబరు-10లో చేపడతారు. అలాగే విశాఖ దక్షిణ నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంటు ఓట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం మొదటి అంతస్తులో చేపడతారు. న్యూక్లాస్‌రూమ్ మొదటి అంతస్తు రూమ్-1లో విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్, రూమ్ నంబరు-5లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కిస్తారు. ఇనుస్ట్రుమెంటేషన్ విభాగంలోని సెమినార్ హాలులో విశాఖ పశ్చిమ అసెంబ్లీ, క్లాస్‌రూమ్-3లో పార్లమెంటు ఓట్లు, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం కింద అంతస్తులోని డ్రాయింగ్‌రూమ్‌లో గాజువాక అసెంబ్లీ, మొదటి అంతస్తులోని సెమినార్ హాలులో పార్లమెంటు, ఇంజనీరింగ్ కళాశాల మెయిన్‌బ్లాక్ రూమ్ నంబరు 205లో పెందుర్తి అసెంబ్లీ, మొదటి అంతస్తులోని రూమ్ నంబరు 202లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కింపు చేపడతారు. కాగా పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లు ఈఈఈ విభాగం సెమినార్ హాలులో నిర్వహించనున్నారు.

గెలుపెవరిదో?

... 5వ పేజీ తరువాయి

భావిస్తోంది. ఇప్పటికే ఒకసారి ఎంపీగా గెలిచి ఉండడం, అనేక అభివృద్ధి పనులు చేసిన పేరు ఉండడంతో రెండోసారి ఎంపీగా గెలుస్తానని కొత్తపల్లి గీత ధీమా వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ జిల్లాలో గాజువాక, భీమిలి, తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజక వర్గాల్లో బలమైన అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేయగా, వైసీపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పోటీగా నిలిపింది. ఈ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి అమర్‌నాథ్ గెలుపుపై పార్టీ వర్గాలు కూడా ఆశలు పెట్టుకున్నట్టు లేవు. ఇక్కడి నుంచి కేఏ పాల్ కూడా ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మిత్రులు పోటీ పడ్డారు. ఇద్దరూ మాజీ మంత్రులే. టీడీపీ నుంచి గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పోటీ చేశారు. ముత్తంశెట్టి భీమిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఇదేమూడోసారి. గంటా శ్రీనివాసరావు తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక నియోజకవర్గం నుంచి రెండో దఫా పోటీ చేయడం ఇదే తొలిసారి. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది వేచి చూడాలి.

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరపున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీ చేశారు. వాసుపల్లి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇది మూడోసారి. ఇరు వర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. వంశీకృష్ణ శ్రీనివాస్ మంచి మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ శిబిరంలోను దక్షిణం తమదే అనే మాట వినిపిస్తోంది.

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పాత కాపులే మళ్లీ బరిలో దిగారు. ఒకే సామాజిక వర్గం నుంచి ప్రధాన పార్టీలు అభ్యర్థులు నిలవడం విశేషం. కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, వైసీపీ తరపున కేకే రాజు పోటీ చేశారు. ఈసారి టీడీపీ, జనసేనలు కూడా అండగా నిలవడంతో విజయం ఖాయమని విష్ణుకుమార్‌రాజు విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు తన గెలుపు ఖాయమని కేకే రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పశ్చిమంలో టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనందకుమార్ పోటీ చేశారు. ఇరు వర్గాలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి.

హై అలర్ట్

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. సిబ్బందికి బాడీ వార్న్ కెమెరాలను అందజేసి, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. అల్లర్లకు పాల్పడేందుకు అవకాశం ఉందని గుర్తించిన 230 మందితోపాటు 650 మంది యాక్టివ్ రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటుచేసి నగరంలో ఏ ప్రాంతంలో ఏం జరుగుతుందనేది ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా అల్లర్లు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గుంపులుగా తిరుగుతున్నాసరే డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే మూడు నిమిషాల వ్యవధిలో సిబ్బంది అక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి నియోజక వర్గానికి ఒక డ్రోన్‌ను కేటాయించామని, వాటిని సిబ్బంది ఎగరవేస్తూ వీధులు, కూడళ్లలో జనసంచారం ఎలా ఉందనే దానిపై నిఘా పెడతారన్నారు. నగరంలో 144 సెక్షన్‌తోపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ర్యాలీలు, విజయోత్సవ సంబరాలు, సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఓట్ల లెక్కింపునకు వెళ్లే సమయంలోనూ, పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికివెళ్లే సమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, ముప్పు ఉందని గుర్తించిన అభ్యర్థులకు బాక్స్ తరహా సెక్యూరిటీ కల్పిస్తామని సీపీ చెప్పారు. అలాగే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోటీలో నిలిచిన 44 మంది అభ్యర్థుల ఇళ్ల వద్ద కూడా ముందుజాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై కేసులు పెట్టి రౌడీషీట్ తెరుస్తామని సీపీ హెచ్చరించారు. ఆయా గ్రూపుల అడ్మిన్లను కూడా బాధ్యులను చేసి ఐటీ యాక్ట్ 66ఏ కింద కేసులు నమోదుచేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనల కేసుల్లో చిక్కుకుంటే వారికి భవిష్యత్తులో పాస్‌పోర్ట్ పొందే అవకాశం కోల్పోవాల్సి ఉంటుందన్నారు.

వైసీపీలో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఈనెల ఒకటో తేదీ సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ వైసీపీ నేతలకు చెమటలు పట్టించాయి. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థల్లో అత్యధికం కూటమిదే విజయమని స్పష్టం చేశాయి. కూటమికి 120 నుంచి 161 స్థానాలు రాబోతున్నాయని పేర్కొనడంతో వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేశామని, ఒకవేళ ఓటమిపాలైతే ఆర్థిక ఇబ్బందులతోపాటు కొత్త ప్రభుత్వం నుంచి సమస్యలు కూడా చుట్టుముడతాయని కంగారుపడుతున్నారు. కానీ కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వైసీపీకి అనుకూలంగా ఉండడంతో విజయంపై ఆశతో ఉన్నారు. భారీ మెజారిటీ అవసరం లేదని, ఏదోవిధంగా బయటపడితే చాలని అనుకుంటున్నారు.

గాండ్ల, తెలికుల సంక్షేమానికి కృషి


నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

మహారాణిపేట, జూన్ 3: గాండ్ల, తెలికుల సామాజిక వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని సంఘం నూతన అధ్యక్షుడు దాడి సత్యనారాయణ తెలిపారు. సోమవారం మహారాణిపేట దండుబజారు ప్రాంతంలో అఖిల గాండ్ల, తెలకుల సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ట్రస్టు బోర్డు చైర్మన్ పెబ్బిలి రవి కుమార్, దాడి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. తెలికుల కులస్థులను ఒక తాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో కృషి చేస్తామన్నారు. ఇళ్లులేని వారికి ఇళ్ల మంజూరుకు, సామాజిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న రోజులలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన చిన్నారులకు ప్రతిభా అవార్డులతోపాటు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో జిల్లాలో కల్యాణ మండపాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఏర్నేటి తాతారావు కార్యదర్శులు చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్ ఏర్నేటి సన్యాసిరావు , కనక సూర్య పద్మావతి, టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న బెనారస్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూన్ 3: చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం (5న) విశాఖ నుంచి బెనారస్ వెళ్లే 18311 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటల 45 నిమిషాలపాటు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖలో ఉదయం 4.20 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 7.05 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపుకు ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మంగళవారం జరగనుంది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బంది, ఇతర అధికారులు, పార్టీల ప్రతినిధులకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే, తక్షణం చికిత్సనందించేందుకు వీలుగా ఆరు మెడికల్ క్యాంపులను వైద్యశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటింగ్ కేంద్రం వద్ద ఒక్కో క్యాంపులో డాక్టర్, నర్సింగ్ సిబ్బంది, ఆశతోపాటు ప్రాథమిక వైద్య సేవల కోసం మెడికల్ కిట్, మందులు ఏర్పాటు చేశారు. అలాగే, రెండు 108 అంబులెన్స్, మరో రెండు ప్రైవేటు అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రాలు వద్ద సిద్ధంగా ఉంచుతున్నట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

» మలి విడత హ్యాండ్ హోల్డ్ శిక్షణలో కలెక్టర్ మల్లికార్జున



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనలు, ప్రత్యేక ఉత్తర్వులు ద్వారా ఇచ్చిన ఆదేశాలను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. పొరపాట్లకు తావులేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది పూర్తిగా సన్నద్ధం కావాలని సూచించారు. పార్లమెంట్ స్థానానికి పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఈఈఈ బ్లాక్‌లో ఏర్పాటుచేసిన లెక్కింపు కేంద్రంలో సోమవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పరిశీలకులు, సీపీ రవిశంకర్‌తో కలిసి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సిబ్బంది పూర్తిగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ విధిగా ఐడీ కార్డులు ధరించాలని, మొబైల్ ఫోన్లను తీసుకురావద్దని సూచించారు. నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోవాలని,పోలీస్ సిబ్బందికి సహకరించాలని సీపీ రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్ ఓట్ల విభజన, లెక్కింపు, నివేదికల తయారీపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అవగాహన కల్పించారు. వాలిడ్, ఇన్వాలిడ్ ఓట్లను విభజించిన తరువాత అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలు వివరించారు. ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. శిక్షణలో ఏఆర్‌వోలు, అదనపు ఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ మైక్రో అబ్జర్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

మురళీనగర్, జూన్ 3 ; ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మురళీనగర్ మహిళా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బాలభాను స్కూలు వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో 51 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ప్లాస్టిక్ నిర్మూలన, పచ్చదనం పెంపు, కాలుష్య నివారణపై చిత్రాలను వేశారు. గ్రీన్ క్లైమెట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆకుకూరల విత్తనాలు, కూరగాయల విత్తనాలు అందించారు. జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవం రోజునవిజేతలకు బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మహిళా వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు ఎస్.లలితారెడ్డి, క్లబ్ కార్యదర్శి సి.హెచ్.లక్ష్మి, యూనివర్సల్ యూత్ వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ వంశీ, బాలభాను స్కూలు యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

జాతీయ చెస్ ర్యాపిడ్‌లో సాహితీవర్షిణి ప్రతిభ


ఐదో స్థానానికి చేరిన సాహితీవర్షిణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 3: చెస్ ర్యాపిడ్‌లో జాతీయ మహిళల ర్యాంకింగ్‌లో విశాఖకు చెందిన ఫిడే మాస్టర్ మూగి సాహితీ వర్షిణి ఐదో స్థానానికి చేరింది. జాతీయస్థాయిలో మహిళల ర్యాపిడ్ ర్యాంకింగ్‌కు సంబంధించి ఫిడే రేటింగ్ విడుదల చేసిన జాబితాలో గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి (2456) ద్రోణావల్లి హారిక (2415), ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ (2401), గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు (2359) తొలి నాలుగు స్థానాలలో నిలవగా, 2329 రేటింగ్‌తో సాహితీ వర్షిణి ఐదో స్థానానికి చేరడం విశేషం. ఇటీవల బుడాపెస్ట్ స్ప్రింగ్ ఫెస్టివల్ చెస్ టోర్నీలో 2200 ప్లస్ రేటింగ్ మహిళల విభాగంలో పోటీపడి మూడో స్థానం సాధించడంతోపాటు 19 పాయింట్లను పెంచుకుంది. కాగా, క్లాసిక్‌లో 2269, ర్యాపిడ్‌లో 2329, బ్లిట్జ్ లో 2193 రేటింగ్‌లో ఉంది. సాహితీవర్షిణికి తన తండ్రి లోకేశ్ కోచ్‌గా వ్యవహరించనుండడం విశేషం.

ఓట్ల లెక్కింపు ఇలా...

... 5వ పేజీ తరువాయి

బూత్ నంబరు ఒకటి నుంచి 14 వరకు తొలి రౌండ్‌లో తీసుకువస్తారు. మొత్తం 14 టేబుళ్లపై ఈవీఎంలు లెక్కింపు పూర్తయితే ఒక రౌండ్‌గా పరిగణిస్తారు. అందువల్ల ప్రతి అరగంటకు ఒక రౌండ్ లెక్కింపు పూర్తవుతుంది.

- జిల్లాలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 25,817 పోస్టల్ బ్యాలెట్లు రాగా ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటుచేసిన అధికారులు 15 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. అలాగే పార్లమెంటుకు 25,681 పోస్టల్ బ్యాలెట్లు రాగా రెండు హాళ్లలో 18 టేబుళ్లు ఏర్పాటుచేసి మూడు రౌండ్లలో లెక్కింపు చేపడతారు. ఈవీఎంలతో పోల్చితే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఆలస్యం కానున్నది. ఈ నేపథ్యంలో పార్లమెంటు తుది ఫలితం వచ్చేసరికి రాత్రి పొద్దుపోతుందని అంచనా.

మధ్యవర్తిత్వంతోనే పెండింగ్ కేసుల పరిష్కారం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్


శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖపట్నం(లీగల్), జూన్ 3: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 70 నుంచి 90 శాతం మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు సోమవారం జిల్లా కోర్టుల ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 30మంది న్యాయమూర్తుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంసీపీసీ శిక్షకులు నిసాస క్సేనా, డాక్టర్ ఆదితి అగర్వాల్ సూచనల మేరకు మధ్యవర్తిత్వ మెలకువలు తెలుసుకుని, కేసులకు వాటిని అన్వయించి కక్షిదారులకు సత్వరన్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే సమయం, వ్యయం ఆదా అవుతుందన్నారు.

టీడీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు


బల్లగిరి వెంకన్న ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

అల్లిపురం, జూన్ 3: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ 33వ వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమాలదేవి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వెంకటేశ్వరమెట్ట బల్లగిరి వెంకన్న ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆవరణలో 108 కొబ్బరికాయలు కొట్టారు. దక్షిణ నియోజకవర్గంలో వంశీకృష్ణ గెలుపొందాలని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించామన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించారు. గందా సంధ్య, సింగంపల్లి మాధవి, పి. ఆదినారాయణ, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై 'డయల్ యువర్ సీపీ'

మహారాణిపేట, జూన్ 3: పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో కమిషనర్ ఏ రవిశంకర్ సోమవారం దిశ దివ్యాంగ సురక్ష డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది దివ్యాంగ కాలర్స్ నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కారానికి అధికారులకు దేశించారు.

బస్సుపాస్ కౌంటర్లకు రెండు రోజులు సెలవు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 3: ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని బస్‌పాస్ కౌంటర్లకు గురు,శుక్రవారాలు సెలవు. ఈ మేరకు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్సు పాస్‌లకు సంబంధించిన అప్లికేషన్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా బస్సు పాస్‌ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా రెండు రోజులు పనిచేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సు, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, మధురవాడ, గాజువాక, సింహాచలం, స్టీల్ సిటీ , వాల్తేరు, పెందుర్తిలలోని కౌంటర్లనుంచి బస్సు పాస్‌లు జారీ కావని ఆర్ఎం పేర్కొన్నారు. బస్సుల పాస్‌ల వినియోగదారులు దీన్ని గమనించాలని సూచించారు. శనివారం నుంచి అన్ని కౌంటర్లనుంచి అన్ని రకాల బస్సు పాస్‌లు జారీచేస్తామని పేర్కొన్నారు.

రిసార్ట్‌లకు ఫుల్ డిమాండ్

స్నేహితులతో కలిసి ఎన్నిక ఫలితాలను వీక్షించేందుకు పలువురు ఆసక్తి

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు మంగళవారం జరగబోతోంది. ఈ సందర్భంగా నగరంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, రిసార్టుల్లో గదులకు డిమాండ్ పెరిగింది. గతనెల 13న సార్వత్రిక ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఫలితాలపై తీవ్ర ఆసక్తి నెలకొంది. విజయంపై ఎవరికివారే ధీమా వ్యక్తంచేస్తున్నా వైసీపీ నేతలు ఓటమి తప్పదనే అభిప్రాయంతో ఉన్నారు. అయితే విజయంపై వారిలో ఎక్కడో ఆశలున్నాయి. కాగా కూటమి అభ్యర్థులకు విజయంపై ధీమా ఉన్నప్పటికీ సంక్షేమపథకాలు వైసీపీకి దన్నుగా నిలుస్తాయేమోననే భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లు కూడా భారీగానే జరిగాయి. సర్వే సంస్థల్లో అత్యధికం కూటమి విజయం సాధిస్తుందని తేల్చడంతో 2:1 నిష్పత్తిలో బెట్టింగ్‌లు జరిగాయి. కౌంటింగ్ నేపథ్యంలో బెట్టింగ్ కాసినవారితోపాటు ప్రధానపార్టీల నాయకులు, కార్యకర్తలు స్నేహితులతో కలిసి ఎన్నికల సరళిని టీవీల్లో వీక్షించేందుకు ఆసక్తిచూపుతున్నారు. వారంతా నగరశివార్లలోని గెస్ట్‌హౌస్‌లు, బీచ్‌రోడ్డులోని హోటళ్లు, రిసార్టుల్లో గదులను బుక్ చేసుకున్నారు. ఇప్పటికే రిసార్టులు హౌస్‌ఫుల్ అయిపోగా, బీచ్‌రోడ్డులోని స్టార్‌హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల్లో కూడా రూమ్‌లన్నీ దాదాపు బుక్ అయిపోయినట్టు హోటళ్ల నిర్వాహకులు తెలిపారు.

ప్రధాన పార్టీల్లో టెన్షన్..టెన్షన్

- నేడు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు
- టీడీపీ, వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ
- భీమిలిలో పెద్దఎత్తున మోహరించిన పోలీసులు



భీమిలిలో బందోబస్తుకు తరలివచ్చిన పోలీసులు

భీమునిపట్నం, జూన్ 3: పోలింగ్ ముగిసి సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండడంతో భీమిలిలో ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఇప్పటివరకు ఎవరికి వారు మాదే గెలుపు అని ధీమా వ్యక్తం చేసినా ఈవీఎంలు తెరిస్తే ఏమవుతుందోననే భయం వారిని కమ్మేస్తోంది. నియోజకవర్గం పరిధిలో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ ప్రధాన పోటీ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుల మధ్యే సాగింది. 2009 ఎన్నికల్లో ముత్తంశెట్టి ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసి 6,310 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి 9,712 ఓట్ల ఆధిక్యత సాధించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు 37,226 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అభ్యర్థులిద్దరూ స్నేహితులు. ఇప్పటివరకూ ఓటమిని ఎరుగని రాజకీయ ఉద్దండులు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, పొత్తుల నేపథ్యంలో వీరు ప్రత్యర్థులుగా బరిలో నిలిచారు.

నియోజకవర్గంలో ముత్తంశెట్టికి ముందుగానే టికెట్ ఖరారు కావడంతో ప్రచారంలో దూసుకుపోయారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని పూర్తి విశ్వాసంతో ఉన్నారు. కాగా గంటా శ్రీనివాసరావుకు టీడీపీ టికెట్ ఖరారు చేయడంలో జాప్యం జరిగినప్పటికీ నియోజకవర్గ నేతలు, అభిమానులు, ప్రజలతో ఆయనకున్న సత్సంబంధాలు, గతంలో చేసిన అభివృద్ధిని ప్రచారం చేస్తూ తనదైన శైలిలో ప్రణాళికా బద్ధంగా దూసుకుపోయారు. అద్భుత ప్రజాదరణ లభించిందని, విజయం ఖరారైందని మెజారిటీకే ప్రయత్నిస్తున్నామని ప్రకటించారు. నియోజకవర్గంలో బలమైన టీడీపీ కేడర్ ఆయన వెంట సైన్యంలా నడిచింది. వైసీపీలోకి వెళ్లిపోయిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా తిరిగి సొంతగూటికి చేరడంతో గంటా బలం మరింతగా పెరిగింది. దీనికి జనసేన, బీజేపీ పొత్తు తోడవడంతో మెజారిటీపైనే దృష్టి సారించామని గంటా ప్రకటించారు. అయితే 2019 ఎన్నికల్లో తన వెంట నడిచిన వైసీపీ కేడర్ చెక్కు చెదరలేదని, తన గెలుపు తథ్యమనే నమ్మకంతో ముత్తంశెట్టి వున్నారు.

నియోజకవర్గంలో ఈ సారి మొత్తం ఓట్లు 3,63,013 కాగా, పురుషులు 1,78,090 మంది, స్త్రీలు 1,84,908 మంది, ఇతరులు 15 మంది వున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పురుషులలో 1,35,301 మంది, స్త్రీలలో 1,40,446 మంది మొత్తం 2,75,747 మంది ఓట్లు వేయగా 75.96 శాతం పోలింగ్ జరిగింది. పద్మనాభం మండలంలో 36,561 మంది, ఆనందపురంలో 45,325 మంది, భీమిలిలో 31,408 మంది, జీవీఎంసీ ఒకటో వార్డులో 11,450 మంది, రెండో వార్డులో 12,906 మంది, మూడో వార్డులో 10,387 మంది, నాల్గో వార్డులో 14,304 మంది, ఐదో వార్డులో 23,689 మంది, ఆరో వార్డులో 27,439 మంది, ఏడో వార్డులో 23,548 మంది, 8వ వార్డులో 15,842 మంది, 14వ వార్డు(పాక్షికం)లో 1,037 మంది, 15వ వార్డులో 2,021 మంది, 45వ వార్డులో 3,962 మంది, 89వ వార్డులో 5,596 మంది, 98వ వార్డులో 10,270 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

- అడిషినల్ ఎస్పీ ఎంఆర్‌కే రాజు



మాట్లాడుతున్న అడిషినల్ ఎస్‌పి ఎంఆర్‌కె రాజు

భీమునిపట్నం, జూన్ 3: నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని అడిషినల్ ఎస్పీ, నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి ఎంఆర్‌కే రాజు కోరారు. స్థానిక సెయింట్ ఆన్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందితో ఆయన సోమవారం సమావేశమయ్యారు. పట్టణంలో తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ కార్యాలయాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నార్త్ ఏసీపీ సునీల్, డీఎస్పీ తాతారావు, సీఐ డి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. అడిషినల్ ఎస్పీ ఎంఆర్‌కే రాజు పర్యవేక్షణలో నార్త్ ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. సుమారు 100మంది సిబ్బందితోపాటు అదనంగా మరో 30 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులను రంగంలోకి దింపారు. వీరితో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. మరో మూడు డే పెట్రోలింగ్ పార్టీలు, ఒక నైట్ పెట్రోలింగ్ పార్టీలతో బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలైన లక్ష్మీపురం, దాకమర్రి, తాటితూరు, గొల్లల తాళ్లవలస, చిననాగమయ్యపాలెం, ఎగువపేట, చేపలుప్పాడ తదితర గ్రామాల్లో 24 గంటల పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. వైసీపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయాలవద్ద, గాదు వీధిలోని బీజేపీ కార్యాలయం వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే మెసేజ్‌లను సెండ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు హౌస్ డిటెక్షన్ పార్టీని నియమించారు.

సింహాచలం: ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రేటర్ 98వ వార్డులోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు సీలు వేశారు. తెలుగుదేశం, వైసీపీ కార్యాలయాల వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ప్రధాన కూడళ్లలో జనం గుమిగూడకుండా చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం 144సెక్షన్ అమల్లో ఉంటుందని శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు.

పద్మనాభం: ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో 144 సెక్షన్, పోలీసు యాక్ట్ అమలుచేస్తున్నారు. సుమారు 40మంది సిబ్బందితో నాలుగు పెట్రోలింగు టీములు, నాలుగు స్ట్రైకింగ్ టీములు గస్తీ తిరుగుతున్నాయి. ప్రజలు గుమికూడి ఉండరాదని హెచ్చరించారు. ఘర్షణలు, కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలు, బాణసంచా పేలుళ్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏడీసీపీ (అడ్మిన్) ఎంఆర్‌కే రాజు, ఏసీపీ సునీల్, సీఐ సీహెచ్ శ్రీధర్, సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

భారీ వర్షంతో రాకపోకలకు అవస్థలు



బురదమయమైన రెడ్డిపల్లి రహదారి

పద్మనాభం(రూరల్), జూన్ 3: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుగ్రామాల్లో రహదారులపై నీరు నిలచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి హైస్కూల్ నుంచి బంగారమ్మతల్లి గుడి వరకు వర్షం నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని గత ఐదేళ్ల నుంచి ఆర్అండ్‌బీ అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు వాపోయారు. ఇకనైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



డీఆర్‌డీఏ కార్యాలయం దారిలో విరిగిపడిన చెట్టు కొమ్మ

గాలులకు కూలిన చెట్టు

ఎం.వి.పి.కాలనీ: ఎం.వి.పి. కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లే దారిలో ఓ పెద్ద వృక్షం కొమ్మలు విరిగి పడటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎక్కడికక్కడ మురుగు నీరు, చెత్తా చెదారం నిల్వ ఉండిపోయింది. ఎం.వి.పి. సర్కిల్ నుంచి అల్వార్ దాస్ మైదానం వరకూ చిరు దుకాణాల వల్ల చెత్తా పెరిగిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ప్రాంతంలో జనాలు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.

సింహాచలేశుడికి ఒడిశా దాసుడి నిత్య కల్యాణోత్సవం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దాసుడు దంపతులు

సింహాచలం, జూన్ 3: వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఒడిశాకు చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఏటా వైశాఖమాసంలో బంధుమిత్రులు, శిష్యగణాలతో సింహగిరికి చేరుకుని మూడునెలల పాటు ఇక్కడ బస చేస్తారు. ఈ సమయంలో స్వామి ఆర్జిత సేవలన్నింటినీ జరిపించడం తాత, తండ్రుల నాటి నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో సింహాచలం చేరుకున్న దాసుడు సోమవారం ఆర్జిత నిత్యకల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అర్చక బృందం దాసుడితోపాటు పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో భాగంగా కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు కన్యావరుణలు, మధుపర్కాలుగా దాసుడి దంపతులు సమర్పించిన పట్టువస్త్రాలను స్వామికి నివేదించారు. మంగళవాద్యాలు, వేదమంత్రాల మధ్య జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణలు జరిపి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అంతరాలయంలో దాసుడు కుటుంబం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి గంటా రవితేజ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న రవితేజ

పద్మనాభం, జూన్ 3: పద్మనాభంలోని షిర్డీసాయి, పార్వతమ్మ ఆలయాల వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు (అన్నమయ్య) ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధనను టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయినాథునికి, పార్వతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణాపురం సర్పంచ్ మొకర లక్ష్మీ భవానీ, ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ ఎంపీపీ లీలావతి, గోపీబాబు, ఇతర నాయకులు ఎర్రిబాబు, పీవీరమణ, కె.వి. సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడి విజయం సాధించాలని పూజలు

ఆరిలోవ, జూన్ 3: ఎన్నికల్లో వెలగపూడి రామకృష్ణ బాబు తూర్పు నియోజక వర్గంలో నాల్గోసారి గెలవాలని ఆకాంక్షిస్తూ తోటగరువు శివాలయంలో సోమవారం టీడీపీ విశాఖపార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, నాయకులు దువ్వి తాతారావు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా షిర్డీసాయి బ్రహోత్సవాలు



షిర్డీ సాయికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న రమణ దంపతులు

ఆరిలోవ, జూన్ 3: హనుమంతువాక కూడలి సమీపంలోని సంజయగాంధీ కాలనీ షిర్డీసాయి బాబా బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయినాథునికి ఆలయ చైర్మన్, వ్యవస్థాపకుడు, విశ్రాంత డీజీ బి.ఐ. రమణకుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మి అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామిని గులాబీలతో అలంకరించి, 15 రకాల మిఠాయిలు , 15 రకాల పండ్లను నివేదించారు.



శిక్షణకు హాజరయ్యేందుకు క్యూలైన్‌లో నిల్చున్న సిబ్బంది



సిబ్బంది పేర్లను నమోదుచేసుకుంటున్న అధికారులు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిబ్బంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని శిక్షణకు హాజరయ్యారు.

కూటమిదే అధికారం: బీజేపీ

పద్మనాభం(రూరల్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు అన్నారు. పద్మనాభంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ప్రజల సంక్షేమానికి, దేశాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఈనేపథ్యలో ప్రజలు మద్దతుగా నిలుస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటుకానుందని ఆశాభావం వ్యక్తంచేశారు. భీమిలి ఎమ్మెల్యేగా మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తప్పకుండా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆపార్టీ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి’

ఎం.వి.పి.కాలనీ, జూన్ 3: ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణంనుంచి రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో రాష్ట్రంలో 140కి పైగా స్థానాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించనుందన్నారు. అన్ని సర్వేలు ఎన్డీయే కూటమిదే విజయమని స్పష్టం చేశాయన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

పద్మనాభం (రూరల్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. గత నెల 13న జరిగిన ఓటింగ్‌లో బూత్‌ల వారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడనున్నాయో అంచనా వేసుకుని గెలుపు, ఓటములపై జోరుగా పందెలు సాగుతున్నాయి. ఎవరికి వారు తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏనోట విన్నా ఫలితాలు బెట్టింగ్‌ల మాటలే వినిపిస్తున్నాయి. మరి కొద్ది గంటల్లో వెలువడనున్న ఫలితాల్లో విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బీఆర్‌టీఎస్‌లో వెలిగిన వీధి దీపాలు

ఆరిలోవ, జూన్ 3: హనుమంవాక జంక్షన్‌నుంచి కేంద్రకారాగారం వరకుగల బీఆర్‌టీఎస్ రోడ్డులో వీధిలైట్లు వేశారు. ఈ మార్గంలో అంధకారం నెలకొనడంతో ' ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం వీధి దీపాలు వేయడంతో ఆ మార్గం వెలుగులతో నిండింది. దీంతో పాదచారులు, వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

గెడ్డల మూసివేతతో ముప్పు

భీమునిపట్నం, జూన్ 3: భీమిలి తీరప్రాంతాన్ని ఆనుకునివున్న గెడ్డలను మూసివేసి పక్కా నిర్మాణాలు చేపట్టడంతో భవిష్యత్తులో ప్రజా జీవనానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణ సర్వే నంబరు 1522 లో సహజసిద్ధంగా వున్న గెడ్డలను మూసివేయడం వల్ల వర్షపు నీరు సముద్రంలో కలిసే అవకాశం లేకుండా పోయిందన్నారు. తీరంలో ఇసుకతిన్నెలను చదును చేసేస్తున్నారని దీనివల్ల సముద్రం పోటు సమయాలలో ఒడ్డుకు చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందన్నారు. జీవీఎంసీ, ప్రభుత్వ అధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

భీమునిపట్నం, జూన్ 3: ఆనందపురం జడ్పీ ఉన్నత పాఠశాల, భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ హైస్కూల్‌ల్లో జరుగుతున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలను సోమవారం విద్యాశాఖ జోన్-1 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయభాస్కర్ పరిశీలించారు. ఆనందపురంలో బయాలజీ పరీక్షలో ఏడుగురిలో ఆరుగురు విద్యార్థులు, వాణిజ్యశాస్త్రంలో 16 మందికి 15 మంది హాజరైనట్టు చెప్పారు. భీమిలి కేంద్రంలో బయాలజీకి 9 మందికి 8 మంది, వాణిజ్య శాస్త్రంలో 18 మందికి 15 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా జాగ్రత్త వహిస్తున్నట్టు చెప్పారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 33, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 18, క్యారెట్ 38, దొండకాయలు 20, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 156, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 38, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

గంటాను కలిసిన టీడీపీ నాయకులు



గంటాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పద్మనాభం మండల టీడీపీ నాయకులు

పద్మనాభం, జూన్ 3: మండలానికి టీడీపీ నాయకులు భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావును విశాఖలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా పలు సర్వేలు కూటమికి అనుకూలంగా వచ్చిన అంశంపై చర్చించారు. ఈ క్రమంలో ముందుగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, మాజీ ఎంపీపీ డి.గోపీబాబు, పార్టీ మాజీ అధ్యక్షుడు పీవీ రమణ, నాయకుడు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడితో అయ్యన్నపాత్రుడు భేటీ



వెలగపూడితో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ఎం.వి.పి.కాలనీ, జూన్ 3: తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయానికి టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు సోమవారం వచ్చారు. ఇద్దరూ ఎన్నికల సరళి, ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడుకున్నారు. గెలుపుపై ఇద్దరూ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని, రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య?

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు



రామారావు (ఫైల్ ఫొటో)

పెందుర్తి, జూన్ 3: గత ఏడాది నగరంలో కలకలం రేపిన వన్‌టౌన్ కానిస్టేబుల్ బర్రి రమేశ్ హత్య కేసులో ప్రధాన నిందితురాలైన భార్య శివజ్యోతి అలియాస్ శివాని ప్రియుడు, నిందితుడు సియ్యాద్రి వెంకట రామారావు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న రామారావుది హత్య అని, శివానీయే తన భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నిస్తోందని మృతుడి భార్య లావణ్య అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి కూడా తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయనడంతో పెందుర్తి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేశ్‌తో ఆయన భార్య శివాని అతిగా మద్యం తాగించి తన ప్రియుడైన ట్యాక్సీ డ్రైవర్ రామారావు సహకారంతో ముఖం పై దిండు అదిమి ఊపిరాడనివ్వకుండా చేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జైలుకు వెళ్లిన వీరిద్దరూ బెయిల్‌పై బయటకు వచ్చారు. కొంతకాలం కంచరపాలెంలో ఉన్నారు. మూడు నెలలుగా పెందుర్తి మండలంలోని రాజయ్యపేటలో ఓ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శివాని, రామారావుల మధ్య కానిస్టేబుల్ రమేశ్ హత్య విషయంలో పెద్ద వివాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. అనంతరం గది తలుపులు వేసుకున్న రామారావు చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. అయితే ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో శివాని అనుమానంతో కిటికీలోంచి చూడగా రామారావు ఆత్మహత్య చేసుకున్నట్టు కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని రామారావు తల్లి అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్తతో సహజీవనం చేస్తున్న శివానీయే హత్య చేసిందని రామారావు భార్య లావణ్య తెలిపింది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక వాస్తవాలు తెలుస్తాయని, అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

278 మద్యం సీసాలు స్వాధీనం

కొమ్మాది, జూన్ 3: అనధికారికంగా నిల్వ చేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేసిన నేపథ్యంలో పీఎంపాలెం బీ2కాలనీ బ్లాక్ నంబరు 2లో మద్యం సీసాలను నిల్వచేశారనే సమాచారం మేరకు సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌తో దాడులు చేశారు. ఇందులో బుడుమూరు ప్రసాద్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. 180 మి.లీ. సీసాలు 262, 750 ఎం.ఎల్ బాటిళ్లు 16 మొత్తం 278 సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొమ్మాది, జూన్ 3: అప్పుల బాధతో పురుగుల మందు సేవించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బూర చంద్రమౌళి భార్య ఆశాజ్యోతితో కలిసి రుషికొండ పనోరమహిల్స్‌లోని ప్లాట్‌నంబరు ఎస్.ఎం.15-1లో ఉంటున్నారు. వీరికి శ్రీయాస్ (14) కుమారుడున్నాడు. చంద్రమౌళికి ఉద్యోగం లేకపోవడంతో అతడి తల్లి వెంకటరత్నం పింఛన్‌పై ఆధారపడేవాడు. ఇటీవల తల్లి మరణించడంతో చంద్రమౌళి భార్య, తల్లి బంగారునగలు తాకట్టు పెట్టడంతో పాటు తనకున్న భూమిని కూడా విక్రయించి నెట్టుకొచ్చాడు. అప్పుల బాధతో మార్చి 25న పురుగుల మందు సేవించాడు. అప్పటి నుంచి వివిధ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.